మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలి

**జిల్లా కేంద్రంలో అధికారుల సమీక్ష సమావేశం ;మంత్రి జూపల్లి కృష్ణారావు**





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

**చిన్నంబావి,మే 12 ప్రభాతవార్త :**కొల్లాపూర్ నియోజక పరిధిలోని చిన్నంబావి, వీపనగండ్ల,పానగల్ మండలాలు,ఎదుల మండలంలోని 5 గ్రామ పంచాయతీలకు వేసవి కాలంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్టేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.మూడు మండలాల గ్రామ సర్పంచులు, ఎ.ఈలు సైతం పాల్గొన్న ఈ సమీక్ష సమావేశంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామసర్పంచులు ఒక్కో గ్రామపంచాయతీ వారిగా తమసమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న మిషన్ భగీరథ అధికారులు,ఎఈలు సమస్యకు గల కారణాలను మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి 2040జనాభా అంచనా ప్రకారం రూపొందించిన మిషన్‌భగీరథ తాగునీరు 2026 నాటికే ప్రజలకు -మిగతా4లో..

# అమ్మబోతే.. అడవి!

- తూకం చేసిన వాటికి జాగా లేదు
- రాత్రింబవళ్లు పడిగాపులు..
- సంచి లోడింగ్ రూ. 25, దించడానికి రూ. 6..
- తూకం దగ్గర నుంచి గోదాం వరకు ట్రాక్టర్ కు రూ.1000
- అన్నదాతలకు అడుగడుగునా ఇబ్బందులే..

## నెల రోజులుగా మార్కెట్లోనే మక్కలు



మార్కెట్‌లో రాశులుగా పోసిన ధాన్యం





ధాన్యం దించడానికి లైన్‌లో నిలిచిన వాహనాలు

**జడ్చర్ల, మే 12, ప్రభాతవార్త:** అమ్మబోతే అడివి.. కొనబోతే కొరివి.. " అన్న చందంగా తయారైంది అన్నదాతల దుస్థితి. ఆరుగాలం కష్టం చేసి కన్నబిడ్డల్లా పంటలను కాపాడినా చేతికొచ్చిన పంటను అమ్ముకోలేని పరిస్థితి దాపురించింది. పంటను మార్కెట్కు తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా.. పంటను కొనక..కొన్నా నిల్వ చేసేందుకు జాగా లేక ధాన్యం వద్దే రైతులు పడికాపులు కాస్తున్నారు. జడ్చర్ల కాటన్ మార్కెట్ లో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మక్కలను కొనుగోలు చేస్తున్నది. మాయిస్చర్ 14 ఉన్న క్వింటా మక్కలకు రూ. 2400 ధర నిర్ణయించింది. ఈ క్రమంలో అన్నదాతలు గత నెల రోజులకు పైగా జడ్చర్ల మార్కెట్ కు మక్కలను తీసుకొస్తున్నారు. గత నెలలో 23 వ తారీఖున తూకం చేసిన ధాన్యాన్ని మంగళవారం గోదాంలోకి దింపినట్లు అధికారులు చెబుతున్నారు. అంటే సుమారు 25 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదు అని ఇట్టే అర్థమవుతుంది.

**నెల రోజులుగా పడిగాపులు..**

గత నెల రోజులుగా దాన్యం కొనుగోలులో ప్రభుత్వం అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తునడంతో రైతులు నానా ఇబ్బందులు. శుక్రవారం 40 ట్రాక్టర్లలో జడ్చర్ల పత్తిమార్కెట్ నుంచి లోడింగ్ చేసి నాకు చాలా గోదాంకు పంపక అక్కడ జాగా లేదని కేవలం నాలుగు ట్రాక్టర్లు మాత్రమే దిగుమతి చేసుకొని మిగతా రాష్ట్రాలను మొత్తం రిటర్న్ పంపడంతో, రాత్రంతా అక్కడే జాగరణ చేసిన రైతులు ఆగ్రహంతో జడ్చర్ల కల్వకుర్తి ప్రధాన రహదారి పై పత్తి మార్కెట్ ఎదురుగా నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ లక్ష్మారెడ్డి మిడ్జిల్ వెళ్తున్న సందర్భంగా మార్కెట్ యార్డు వద్ద రైతుల నిరసన వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకొని మార్క్ఫెడ్ డిఎంతో పాటు స్థానిక వ్యవసాయంశాఖ అధికారులను పిలిపించి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ ఇబ్బందులు రాలేదని ఇప్పుడు ఎందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు. గన్ని బ్యాగుల కొరత ఉందని, తూకం చేసిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడా నికి జాగా లేదని అధికారులు తెలపడంతో,పత్తి మార్కెట్లో -మిగతా4లో..

### 25 రోజులు అయింది..



నా పేరు గోపాల్. మాది గంగాపూర్. 80 సంచుల ధాన్యాన్ని 25 రోజుల కింద తూకం చేశారు. అప్పటినుంచి రోజు ఇక్కడే పడిగాపులు కాయాల్సి వస్తున్నది. గోదాముల్లో ధాన్యాన్ని దింపుకోవడానికి జాగా లేదని మార్కెట్లోనే ఉంచారు. తిండి తిప్పలు మాని కుప్పల దగ్గరే తూకం చేసిన సంచుల దగ్గరే కాపలా కాయాల్సి వస్తుంది.

### నెల రోజులు దాటింది..



సార్ నా పేరు గంగయ్య.మాది గోపులాపూర్. నేను 90 సంచుల మక్కలు మార్కెట్ కు తీసుకువచ్చాను. మూడు రోజులు ఆరబెట్టి తూకం చేసి సంచుల్లో నింపారు. ఇక్కడ తిండి తిప్పలు మాని పస్తులు ఉంటున్నాం. మక్కలను తొందరగా మా గోదాములకు పంపండి.

### ట్రాక్టర్ లేదని గోదాంకు పంపలేదు..



సార్ నా పేరు దయ్యాల భీమయ్య. ఖానాపూర్ గ్రామం. నెల రోజులైంది తూకం చేసి. నిన్న, మొన్న ట్రాక్టర్ ఉన్నవారివి గోదాములకు తరలించారు. నాకు ట్రాక్టర్ లేదు. తూకం చేసిన మక్కలు కూడా రోజుకు కొంత మాయమవుతుంది. ప్రతి దానికి డబ్బులే..

# ఆర్అండ్ఆర్ పనులు వేగవంతం చేయాలి

- తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు
- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ఉదండపూర్ రిజర్వాయర్
- నిర్వాసితులను వెంటనే పునరావాస
- కాలనీలోకి తరలించాలి
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**మహబూబ్‌నగర్‌బ్యూరో,మే 12,ప్రభాతవార్త:** ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితుల పునరావాసం(ఆర్అండ్ఆర్) పనులను వేగంగా పూర్తి చేసి నిర్వాసిత కుటుంబాలను వీలైనంత త్వరగా పునరావాస కాలనీలోకి తరలించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు చిన్నగుట్ట తండా, రేగడిపట్టె, తండా తుమ్మల కుంట తండా, శామగడ్డ తండా, పోలేపల్లి హామ్లెట్ల నిర్వాసితులకు సంబంధించిన పునరావాస పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ పునరావాస కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించారు. ఆలయ నిర్మాణ పనులకు ఎండోమెంట్స్ శాఖ నుంచి అవసరమైన డిజైన్ అనుమతులు తీసుకుని పనులను ప్రారంభించాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, అంతర్గత రహదారులు, విద్యుత్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని తెలిపారు.ఇండ్ల నిర్మాణ అనుమతులు, నిర్వాసితులతో అవసరమైన వారికి బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం ఏర్పాటు చేసే విధంగా సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందే వీలుగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ముఖ్యంగా ఉదండపూర్ ఆర్ ఆర్ కాలనీలో దేవాలయ నిర్మాణ పనులను దేవాదాయ శాఖ అనుమతులు తెప్పించుకొని త్వరితగతిన ప్రారంభించాలని, అనంతరం నిర్వాసితులకు ఇళ్ల నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అధికారులను కలెక్టర్ సూచించారు.ప్రాజెక్టు నిర్మాణం మూలంగా మిగిలిన వ్యవసాయ భూములకు వెళ్లడానికి బండ్ల బాటలు వేయవలసిందిగా ఎమ్మెల్యే కోరగా ఇట్టి విషయాన్ని పరిశీలించి నివేదిక సమర్పించవలసిందిగా కలెక్టర్ జడ్చర్ల తాసిల్దార్‌ను ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను సమీక్షించిన కలెక్టర్,వచ్చే పది రోజుల్లో అన్ని ఫైళ్లను క్లియర్ చేయాలని ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే తీసుకున్న చర్యల నివేదికలను సమర్పించాలని సూచించారు.జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, సంబంధిత ఆర్‌డీఓలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూములను రక్షించేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలపై కూడా కలెక్టర్ -మిగతా4లో..



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్



జనగణన ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

# జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి,మే12, ప్రభాతవార్త:**జనాభాగణన2027లో భాగంగా ఈ ఏడాది మొదట ఇండ్ల గణన నిర్వహిస్తున్నందున, ఎన్యూమరేటర్లు నిర్దేశిత వివరాలన్నీ నమోదు చేసుకుని గణనను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.మంగళవారం చిట్యాల,వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 3వవార్డు పోచమ్మగుడిప్రాంతంలో సంబంధిత బ్లాక్ ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న హౌస్‌లిస్టింగ్ గణనను జిల్లాకలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌లో భాగంగా ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఎన్యూమరేటర్ తమకు కేటాయించిన బౌండరీపై పూర్తి అవగాహన -మిగతా4లో..



టాయిలెట్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

# గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్,మే12, ప్రభాతవార్త :**గత ప్రభుత్వం విద్యాసంస్థలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని విప్,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌నగర్‌లోని పురాతన ఎంబీసీజూనియర్‌కళాశాలలో ముడా నిధులు రూ.18లక్షలతో నిర్మించనున్న టాయిలెట్ నిర్మాణానికి ఎమ్మెల్యే యెన్నం శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.ఈ విద్యాసంస్థ ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడ్డారని తెలిపారు. అనంతరం కళాశాల తరగతి గదులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పీకే తిమోతి, నాయకులు చిన్న రాజు, ట్రైటర్ రాజేందర్, సామెల్ దాసరి, ఎంబీసీ చర్చ్ ఉపాధ్యక్షులు జాకబ్ డేవిడ్ స్టీవెన్ పాల్గొన్నారు.

# ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లతో సీఎం సమీక్ష సమావేశం
- నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుంచి సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు
- కొల్లాపూర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు
- ధాన్యం కొనుగోలుకు పక్కా ప్రణాళికతో జిల్లా యంత్రాంగం
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్




వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 12 ప్రభాతవార్త:** రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేస్తూ, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం హైదరాబాద్ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు,పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులలతో కలిసి మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిజిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి అదనపు కలెక్టర్ అమరేందర్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లాకలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హాజరయ్యారు.కొల్లాపూర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని నాగర్‌కర్నూలు, వనపర్తి జిల్లాల్లో సోమవారం నిర్వహించిన వరి కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పలు అంశాల వారీగా కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న సమస్యలపై సమీక్ష నిర్వహించి, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. ముఖ్యంగా జిల్లాలో గుర్తించిన సమస్యలు హమాలీలు, రవాణా సమస్యలను అధిగమించేలా మండల స్థాయిలో వాట్సాప్ గ్రూపులు నిర్వహించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆ గ్రూపుల్లో వచ్చే సమస్యల సమాచారం ఆధారంగా వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చేలా అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలు ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా సజావుగా నిర్వహించేలా చర్యలుతీసుకుంటున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై సమగ్ర వివరాలను రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరిస్తూ, జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని, జిల్లాలో రైతుల నుండి వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా, ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకున్నట్లు, జిల్లాలో ధాన్యం కొనుగోలు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని గత 10 రోజులుగా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో సంబంధిత శాఖల అధికారులతో పలు సమీక్షా సమావేశాలు నిర్వహించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డును నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి క్షేత్రస్థాయిలో తాను కూడా కలిసి పరిశీలించానని నేరుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రతి కొనుగోలుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తిన ఆ అధికారి పూర్తి బాధ్యత వహించి, ఆ సమస్యలను ఆ అధికారి స్థాయిలోనే పరిష్కరించేలా బాధ్యతలు అప్పగించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు, రైతుల నుండి -మిగతా4లో..

# కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం కోసం స్థల పరిశీలన

**డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి**



జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థల పరిశీలన చేస్తున్న శివసేన రెడ్డి

**వనపర్తి,మే12, ప్రభాతవార్త :** జిల్లా కాంగ్రెస్ పార్టీకి శాశ్వత జిల్లా కార్యాలయ నిర్మాణం దిశగా కీలక అడుగులు పడబోతున్నాయని, పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధంగా ప్రశాంత వాతావరణంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన కార్యాలయాన్ని నిర్మించేందుకు చర్యలు ప్రారంభమైనట్లు వనపర్తి డిసిసి చీఫ్,రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి రాజపేట శివారులోని 73 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి, హద్దులను గుర్తించారు. సుమారు ఒక ఎకర విస్తీర్ణంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ స్థల పరిశీలన అనంతరం కార్యాలయ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేసి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని నిర్మాణ కమిటీ సభ్యులకు సూచించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ నేతృత్వంలో త్వరలో కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, గంధం శరవంద, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ సర్వేయర్లు ఉన్నారు.




సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

# జిల్లా రెడ్ క్రాస్ ప్రత్యేక సభ్యత్వ నమోదు కేంద్రం ప్రారంభం

**నారాయణ పేట, మే 12 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి హాల్‌లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక సభ్యత్వ నమోదు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చట్టబద్ధంగా ఏర్పడిన ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ అని తెలిపారు. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించడంలో రెడ్ క్రాస్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కె. సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర రెడ్ క్రాస్ ఎంసీ సభ్యుడు ఆత్మరామ్, జిల్లా జూనియర్, యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్లు జొన్నల సుభాష్, నందు పటేల్, రెడ్ క్రాస్ పాట్రన్ జి.ఆర్. రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ మంజుల, సభ్యుడు ఉమేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టినా... రిజిస్ట్రేషన్ మాత్రం ఇంఛార్జికే...



బాధ్యతలు చేపట్టిన తాహసిల్దార్ మహమ్మద్ హర్షద్

**దేవరకద్ర,మే 12 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల తహసిల్దార్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టిన అధికారి ఉన్నప్పటికీ, రిజిస్ట్రేషన్ వ్యవహారాలను మాత్రం ఇప్పటికీ ఇంఛార్జి అధికారికే అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. దేవరకద్ర తహసీల్దార్‌గా మహ్మద్‌హర్షద్ బాధ్యతలు చేపట్టి 20 రోజులు గడుస్తున్నా నూతన తహసీల్దార్‌కు రిజిస్ట్రేషన్ అధికారాలు అప్పగించకపోవడం వివాదాస్పదంగా మారింది. ఇంచార్జి తహసీల్దారే ఇంకా రిజిస్ట్రేషన్లు చేస్తుండటంపై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిది నెలల క్రితం అప్పటి తహసీల్దార్ కృష్ణయ్య పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ దీపిక ఇంచార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది నెలల పాటు పూర్తిస్థాయి తహసీల్దార్‌ను నియమించలేదు.ఈ నేపథ్యంలో 20 రోజుల క్రితం మహ్మద్ హర్షద్ నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇప్పటివరకు డిప్యూటీ తహసిల్దార్ దీపిక రెడ్డి ఆయనకు రిజిస్ట్రేషన్ అధికారాలు అప్పగించలేదు. దీంతో సబ్ రిజిస్ట్రార్ హోదాలో భూ రిజిస్ట్రేషన్లను ఇంచార్జి తహసీల్దార్ దీపికనే చేస్తున్నారు. ఇంఛార్జ్ అధికారిపై అదనపు భారం పడడంతో పనుల్లో జాప్యం జరుగుతుందని దీనివల్ల ప్రజలు అనవసరంగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజలకు పారదర్శకంగా వేగంగా సేవలు అందించాలంటే, పూర్తిస్థాయి తహసిల్దార్ నే రిజిస్ట్రేషన్ బాధ్యతలు -మిగతా4లో..

## వరుస దొంగతనాలతో..

# భయాందోళనలో గ్రామస్తులు

**నారాయణపేట, మే 12 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో వరుసగా జరుగుతున్న దొంగతనాల ఘటనలు గ్రామ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వారంలో మూడోసారి దొంగలు గ్రామంలో చోరీలకు పాల్పడడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బొక్కి సాయిలు, ప్రభంజన్ రావు ఇళ్లలో దొంగతనాలకు ప్రయత్నాలు జరిగినప్పటికీ ఎలాంటి వస్తువులు దొంగిలించకుండా వెళ్లిపోయినట్లు సమాచారం.



ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ సతీష్ రెడ్డి పోలీసు బృందం

అయితే సోమవారం అర్ధరాత్రి చెవుల సుమిత్రమ్మ ఇంట్లో చోరీ జరిగింది. సుమిత్రమ్మ తన ఇంటి మిద్దెపై నిద్రిస్తుండగా రాత్రి 12గంటల సమయంలో తలుపులు తెరిచిన శబ్దంరావడంతో లేచి చూడగా ఇద్దరువ్యక్తులు అక్కడినుంచి పారిపోతున్నట్లు గుర్తించారు. వెంటనే ఆమె అరుపు వినడంతో చుట్టుపక్కలవారు, అప్పటికే పెట్రోలింగ్‌లోఉన్నపోలీసులు అక్కడికిచేరుకున్నారు. ఇంట్లోని బీరువాలో ఉంచిన అరతులం బంగారు చెవికమ్మలు, రూ.70 వేల నగదు, కాళ్ల పట్టీలు దొంగలు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్సై సతీష్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించి చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. గ్రామంలో వరుసగా దొంగతనాలు జరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే దొంగల ముఠాను పట్టుకొని గ్రామంలో భద్రత కల్పించాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## గోటూరులో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"కార్యక్రమం

**- వరి పంటలో యూరియా వినియోగం తగ్గించాలి**

**- పచ్చిరొట్టె ఎరువులు, పంట మార్పిడి పై శాస్త్రవేత్తల సూచనలు**

**ధన్వాడ, 12 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని గోటూరు రైతు వేదికలో మంగళవారం"రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. ప్రొ॥ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా.ఆదిశంకర్ మాట్లాడుతూ వరి పంటలోయూరియా వినియోగాన్ని తగ్గించి పచ్చిరొట్టె ఎరువులను ఉపయోగించడం ద్వారా నేల సారాన్ని పెంచుకోవచ్చని సూచించారు.



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

అలాగే వరిపంట తర్వాత యాసంగి సీజన్‌లో మొక్కజొన్న,పెసర, మినుము వంటి పంటలతో పాటు నూనె గింజల పంటలైన వేరుశనగ, జొన్నలను సాగు చేయాలని, ఆయిల్ పామ్ పంటను కూడా రైతులు పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారి నవీన్ మాట్లాడుతూ, వరి సాగులో సన్నగింజ రకాలను ఎంచుకోవడం మంచిదని, పచ్చిరొట్టె పైరును ముందుగా వేసి భూమిలో కలియదున్నడం ద్వారా దిగుబడులు మెరుగుపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కొండ్రోన్ పల్లి సర్పంచ్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వైపీ రఘువరన్ సింగ్‌తో పాటు సుమారు 86 మంది రైతులు పాల్గొన్నారు. రైతులు శాస్త్రవేత్తలను వివిధ వ్యవసాయ అంశాలపై ప్రశ్నలు అడిగి సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

## 14న ఎస్సీ రుణాలకై ఇంటర్వ్యూలు

**కెటిదొడ్డి మే 12, ప్రభాతవార్త:**మండల పరిధిలోని ఆయా గ్రామాల ఎస్సీ కార్పొరేషన్ 2025/2026 కింద నిరుద్యోగ యువతి, యువకులు బ్యాంకు రుణాలకై గురువారం 14 వ తేదీ ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణారావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధికై బ్యాంకు రుణాల కోసం ఆన్లైన్ దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు క్రింద కనబరిచిన ఇండియన్ బ్యాంకు వెంకటాపురం,స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా గట్టు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ధరూర్, కు సంబంధించి ఇంటర్వ్యూకి వచ్చే సమయంలో రెండు సెట్లు ఆన్లైన్ దరఖాస్తు ఫామ్ తో పాటు విద్యార్హత కు సంబంధించిన సర్టిఫికెట్ తీసుకొని హాజరు కావాలని ఆయన కోరారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**ఆత్మకూర్ మే 12, ప్రభాతవార్త;** ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం రోజు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని దేవాలయాలను ప్రత్యేకంగా అలంకరించడమే కాకుండా హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మూలమల్ల గ్రామంలో గల పాండురంగ స్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణపతిపూజ,అర్చన అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాదం నిర్వహించారు.



హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మూలమల్ల గ్రామంలో మంగళవారంసాయంత్రం గ్రామంలోని పురవీధులకుండా శోభాయాత్ర నిర్వహించి భక్తులు ఆనందోత్సవాల మధ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా గ్రామ ప్రముఖులు రంగారెడ్డి, భాస్కర్, రవి, వెంకటేష్, భీమన్న, ఆనంద్ గౌడ్ తదితరులతో పాటుగా పలువురు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకం

**కెటిదొడ్డి మే 12, ప్రభాతవార్త;** మండల పరిధిలోని గ్రామాల్లో జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన వారు దగ్గర లో ఉన్న మీసేవ కేంద్రాన్ని వెళ్లి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్, 2017 సంవత్సరం నుంచి కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 సంవత్సరాల పై బడి 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు మరణించినట్లయితే ఆ కుటుంబానికి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 20 వేల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. అర్హులు తమ దరఖాస్తులను మీసేవ కేంద్రాల్లో సమర్పించాలని తెలియజేయడమైంది. దరఖాస్తుతో పాటుగా కింద కనపరిచిన పత్రాలు ఫోటో జత చేసిన దరఖాస్తు పత్రం,తెల్లరేషన్ కార్డు లేదా ఆహారభద్రత కార్డు, కుటుంబ పోషకుని యొక్క మరణ ధ్రువీకరణ పత్రం, మృతుని ఆధార్ కార్డు కార్డు,మృతుని వయసు నిర్ధారణ పత్రం, దరఖాస్తుదారుని ఆధార్ కార్డు, దరఖాస్తుదారుని పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, దరఖాస్తుదారు బ్యాంకు పాస్ బుక్ పత్రాలను జతపరిచి మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించిన వారి దరఖాస్తులను జిల్లా అధికారులకు పంపించి మంజూరి చేయుటకు చర్యలు తీసుకునబడునని ఎంపిడిఓ రమణారావు తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**ఉప్పునుంతల, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దాపూర్ గ్రామం చెందిన తాళ్ల నిరంజన్ కు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును మంగళవారం గ్రామ సర్పంచ్ వంగా సాయిబాబు గౌడ్, బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావుల చేతుల మీదుగా అందజేశారు. బాధితుడు గత కొన్ని రోజుల క్రితం తెలకపల్లి మండల కేంద్రానికి ఆటోలో వెళ్తుండగా



దురదృష్టవశాత్తు బోల్తా పడి కాలు విరగడం జరిగిందని, అప్పట్లో హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స చేయించారు. వైద్యం కోసం పెట్టిన ఖర్చుల వివరాలతో ఆస్పత్రి వారు అందించిన మెడికల్ బిల్లులు తీసుకొని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మండల బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు సంప్రదించారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 60 వేల రూపాయలు మంజూరు కాగా, మంజూరైన 60 వేల రూపాయల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగా సాయిబాబు గౌడ్ , గ్రామ బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు గెలువయ్య, వార్డు సభ్యులు కురుమయ్య, స్కైలాబ్, రేణయ్య, నాగరాజు, నరేందర్, లాలు గౌడ్, మహేష్, శీను, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం

**◆ ప్రభుత్వం వరికొనుగోలు చర్యలు వెంటనే చేపట్టాలి**

**◆మండల బీఆర్ఎస్ నేతలు**



అన్నాసాగర్‌లో ఆందోళన చేపడుతున్న బీఆర్ఎస్ నేతలు

**భూత్పూర్,మే 12,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన వరికొనుగోలును పూర్తి స్థాయిలో చేపట్టడంలో విఫలమైందని భూత్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గడిచిన రెండ్రోజుల నుంచి మండలంలోని పలుగ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులు వరిని పండించి కుప్పలుగా పోసి కొనుగోలు కోసం వరికుప్పలతో ఎదురుచూస్తున్న రైతులను కలుస్తున్నారు. బీఆర్ఎస్ భూత్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు టి మురళీధర్‌గౌడ్,మనెమోని సత్యనారాయణ,మేకల సత్యనారాయణ, తూము శ్రీనవాస్‌రెడ్డి,రైతు బంధు మండల మాజీ అధ్యక్షుడు మొల్గర నర్సింహులుగౌడ్,మాజీ ఎంపిపి సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, వైస్ ఎంపిపి నరేష్‌గౌడ్‌లతో కూడిన బృందం భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్,కప్పెట గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వరికుప్పలతో గన్నీబ్యాగులు,వాహనాల కోసం ఎదురుచూసే రైతులను కలిసి వారి సమస్యల్ని అడిగి తెల్సుకుంటున్నారు. ఈ సందర్భంగా బస్వరాజ్‌గౌడ్ మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంటను కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడంలేదని అన్నారు. ఇకనైన ప్రభుత్వం గన్నీ బ్యాగుల కొరతలేకుండా చేసి తక్షణం వరికొనుగోలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అన్నాసాగర్ సర్పంచి ఆలశ్రీకాంత్‌రెడ్డి,నాల్గోవార్డు కౌన్సిలర్ గడ్డం ప్రేమ్‌కుమార్,మైనార్టీ నేత మొహ్మద్ సాధిఖ్,సింగిల్ విండో డైరెక్టర్ గడ్డం రాములు,భూత్పూర్ బీఆర్ఎస్ పట్టణఅధ్యక్షుడు సత్తూర్ సురేష్‌గౌడ్,తాటిపర్తి మాజీసర్పంచి ఆకుల వెంకటయ్య,సత్తూర్ తిరుపతయ్య గౌడ్,సత్తూర్ రాకేష్‌గౌడ్,ఎండి షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలపై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం సరికాదు

### మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్



రైతులతో మాట్లాడుతున్న మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్

**నారాయణపేట,మే 12 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా అప్పిరెడ్డిపల్లి సెంటర్, సబ్ సెంటర్‌లలో మంగళవారం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి గౌస్ కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే రూ.210 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని 2.63 లక్షల టార్పాలిన్లు, 18.75 కోట్ల గన్నీ బ్యాగులు ముందుగానే సిద్ధం చేసి కొనుగోలు ప్రారంభించామని చెప్పారు. కొన్ని చోట్ల మాత్రమే చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ, ప్రతిపక్షాలు వాటినే పెద్ద సమస్యలుగా చూపిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. వంద కేంద్రాల్లో ఐదు చోట్ల సమస్య ఉంటే ఆ ఐదు చోట్లకే కెమెరాలు తీసుకెళ్లి రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు మద్దతుధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే,కొందరు దళారులు,కమిషన్ దారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా రైతుమాత్రం ఎప్పటికీ ఉంటాడనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. లోపాలు ఉంటే సరిచేయాలని డిమాండ్ చేయాలిగానీ,రైతులను భయపెట్టి దళారులవైపు మళ్లించవద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కొనుగోలు కేంద్రాల వద్ద పర్యవేక్షణ చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా యువజన ఉపాధ్యక్షుడు కురువ మనోజ్, శివన్న సైన్యం బండి ఆనంద్ మనీ, వివేక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు అజయ్

**ఆత్మకూర్ మే 12, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని పరిరక్షించుకునేందుకుగాను అసంఘటిత రంగ కార్మికుల పని భద్రత కోసం ఈ నెల 15 నా చేపట్టే దేశవ్యాప్తంగా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు అజయ్ రైతు సంఘం జిల్లా కోశాధికారి బి వెంకటేష్ తదితరులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రోజు ఆత్మకూరు మండలంలోని గుంటిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో పర్యవేక్షించి పలు విషయాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పండుతోందని అందులో భాగంగానే ఆ పథకాన్ని రద్దుచేసి విఆర్జి బీజీ చట్టాన్ని రూపొందించేందుకు పూనుకోవడం మానుకోవాలని వారు హితవు పలికారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు రోజుకు 600 రూపాయల వేతనం చెల్లించాలని అంతేకాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లకు సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా నెలకు 26వేల రూపాయల వేతనం చెల్లించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఎండాకాలంలో ఉపాధి కూలీలకు ఆన్లైన్లో కాకుండా ఆఫ్లైన్లో మాత్రమే అటెండెన్స్ వేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నెట్వర్క్ రాని ప్రాంతంలో కూలీలు పనిచేస్తున్న సందర్భంలో కూలీలు నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఉపాధి కూలీలకు 12 వేల రూపాయలను చెల్లించాలని గత శాసన సభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులతో పాటుగా ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శిలాఫలకాలకే పరిమితమైన బిఆర్ఎస్ నాయకులు

**అభివృద్ధి పనుల్లో దూసుకుపోతున్న**

**ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలా**

**ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి 366 కోట్లు మంజూరు**

**చేయించిన ఘనత ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిది**

**పదేళ్లలో అభివృద్ధి శూన్యం**

**బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకుల ఫైర్**



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**నవాబుపేట, మే 12 ప్రభాతవార్త :** గత 10 ఏళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా కేవలం శిలాఫలకాలతోనే సరిపెట్టిన బిఆర్ఎస్ నాయకులు రెండేళ్లలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల పక్షపాతిక మండల పొందుతున్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని దమ్ముంటే అభివృద్ధి పనులపై చర్చించి మాట్లాడండి అని చర్చలకు కూడా మేము సిద్ధంగా ఉన్నామని 10ఏళ్లలో మీరు చేసిన అక్రమాలు దోపిడీలు భూకబ్జాలు తప్ప నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది ఏమీలేదని ఈ రెండేళ్లలో చేసిన అభివృద్ధి పనులను పూర్వ లేక అనుచిత వ్యాఖ్య లు చేస్తే సహించేదిలేదని నవాబుపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో నవాబుపేట కాంగ్రెస్ మండల నాయకులు ఏఎంసీ చైర్మన్ హరలింగం, గుండేటి యాదయ్య, మాజీ ఎంపిటిసి నర్సింలు,భూపాల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలుపొందిన రెండున్నర సంవత్సరాలలో రోడ్లు వేసి గ్రామాల్లో సిసి రోడ్లు ప్రతి గ్రామాల్లో వెలిశాయని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు రైతులకు నియోజకవర్గంలో 21 సబ్ స్టేషన్లు అందించి రైతులకు ఉచిత కరెంటు అందించి ప్రజల మండల పొందుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పై ఆయన వ్యక్తిగత విలువలపై టీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏమి మాట్లాడాలో అంశాలు లేక వారికి అవకాశం లేక ఆయన స్నానం చేసే ప్రక్రియపై బీ ఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అభివృద్ధి పనుల పై మాట్లాడకుండా ప్రజల్లో ఆయనకు పెరుగుతున్న ఆదరణను చూసి అభివృద్ధి పనులు చేస్తుంటే మళ్ళీ అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేటట్టు ఉందని భయం గుప్పిట్లో టిఆర్ఎస్ నాయకులు ఏమి మాట్లాడాలో తోచక చిల్లర విషయాలు మాట్లాడి చిల్లరగా మారుతున్నారని నాయకులకు కనీస విలువలు ఉండాలని వాటిని తలదించుకునే స్థాయికి టిఆర్ఎస్ నాయకులు దిగజారుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇంకోసారి ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పై అతని వ్యక్తిగత విషయాలపై విమర్శలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని ప్రెస్ మీట్‌లో వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు గుండేటి యాదయ్య ఎక్స్ ఎంపిటిసి నర్సింలు డిసిసి కార్యదర్శి బంక వెంకటయ్య, తానెం సురేష్ సర్పంచ్ లు కామారం వెంకటేష్, సంతోష్ నాయక్, భూపాల్ రెడ్డి, నరేష్ రాములు, శిల్ప, సత్యం కొల్లి నర్సింలు, బడుగుల రవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపిడిఓ

**నవాబుపేట, మే 22 ప్రభాతవార్త :** మండుతున్న ఉష్ణోగ్రతలపై ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని నీటి వసతి, టెంట్లు, కనీస వసతులు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచుకొని జాగ్రత్త వహించాలని ఉపాధి కూలీలకు ఎంపీడీవో జయరాం నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దర్పల్లి ఉపాధి హామీ పనులను ఎంపీడీవో జయరాం నాయక్ పరిశీలించి ఉపాధి కూలీలకు కావలసిన కనిస వసతులను వారు పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, కూలీల సంఖ్య



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఓ జయరాం నాయక్

పెంచాలని, ప్రతి కూలి సరైన కొలత ప్రకారం పనిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనుల నాణ్యతను, మాస్టర్ రోల్స్‌ను పరిశీలించారు. కూలీలకు మంచినీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా, కొలతల ప్రకారం పనిచేయాలని, దాని ప్రకారమై వేతనాలు చెల్లింపు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎంపీడీవో జయరాం నాయక్, ఏపీవో జ్యోతి ఉన్నారు.

## ఘనంగా శ్రీ హనుమాన్ జయంతి



పాన్ రెడ్డిపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు

**పెద్దమందడి, మే 12 ప్రభాతవార్త :** పెద్దమందడి మండలంలోని పామిరెడ్డి పల్లి గ్రామంలో రెండు రోజుల నుండి హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం రెండో రోజు కార్యక్రమంలో ఆంజనేయస్వామి అభిషేకము,హోమము, చక్రస్నానము స్వామికి జరిపించారు. అనంతరం అన్నదాన ప్రసాదం కార్యక్రమం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ మధిర,మంజుల, మాజీ ఎంపీపీ మండపరెడ్డి సుగుణమ్మ,భక్తులు లక్ష్మారెడ్డి ఆంజనేయులు లక్ష్మణ్ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


### నేడు మామిళ్ళపల్లిలో

## హిందూ సమ్మేళనం

**ఉప్పునుంతల, మే 12 ప్రభాతవార్త :** ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నేడు బుధవారం మండలంలోని మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీ ృనరసింహస్వామి ఆలయంలో హిందూ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యులు గువ్వల బాలరాజు, ఆదిత్య పరాశ శ్రీ స్వామీజీ హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం నేడు బుధవారం సాయంత్రం 5:30 గంటల కు జరుగుతున్నందున ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని సంయమనం పాటించి కార్యక్రమం విజయవంతం చేయాలని, సాయంత్రం జరుగు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### అభ్యర్థులకు మౌలిక పరీక్షలు: ఎంపీడీవో

**మాగనూర్, మే 12 ప్రభాతవార్త:** ఎస్సీ కార్పొరేషన్ 2025, 26సంవత్సరంలో లోన్ కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 14 గురువారం రోజున ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మౌలిక పరీక్షలు నిర్వహిస్తున్న ట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.



అభ్యర్థులు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయపత్రం, పాన్ కార్డు, ఆన్‌లైన్ ఫారం ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

## ధన్వాడలో గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

**జన్మదిన వేడుకల సందర్భంగా**

**సేవా కార్యక్రమం - నిర్వాహకుడికి సన్మానం**

**ధన్వాడ, మే 12 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడలో గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కెంచే కుసుమ యాదయ్య ప్రథమ పుత్రుడు కీ.శే. నరసింహరాజు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహించే ఈ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జ్యోతి రామచంద్రయ్య మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్.వి ఫ్యాషన్ వరల్డ్‌కు చెందిన రఘురాజ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాకం సురేందర్, మాకం ద్వీపక్ రాజ్, కృష్ణతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయిల కోసం పాడి రైతుల ఎదురుచూపులు

**అచ్చంపేట, మే,12 ప్రభాతవార్త :** పాలశీతలీకరణ కేంద్రం అచ్చంపేట పరిధిలో గల పాడి రైతులు పాల బిల్లులు కోటి రూపాయలు బకాయిలు ఉన్నాయి. బిల్లుల కోసం పాడి రైతులు ఎదురుచూస్తున్నారు. 15 రోజులకు ఒక సారి బిల్లులు చెల్లించవలసి ఉండగా 45 రోజులు గడిచినప్పటికీ బిల్లు రాకపోవడంతో పాల బిల్లుల కోసం పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. వివిధ గ్రామాలలోని 680 మంది పాడి రైతులు ప్రతిరోజు 6500 లీటర్ల పాలను పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రానికి పోస్తున్నారు. అధికారులు స్పందించి పాల బిల్లులు ఇవ్వాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్రామాలలో ప్రారంభమైన ఓటర్ మ్యాపింగ్ పై విస్తృత ప్రచారం



వెల్టూర్ లో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ కు సహకరించాలని సూచిస్తున్న ఎన్యూమరేటర్లు.

**ఉప్పునుంతల, మే 12 ప్రభాతవార్త :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలో ఓటర్ మ్యాపింగ్ పై విస్తృత ప్రచారం జరుగుతోంది. ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలనతో పాటు ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ రెండు రోజులపాటు కొనసాగింది. ఈనెల 11 న ప్రారంభమైన ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామాలకు వచ్చిన ఎన్యుమారేటర్లు కోరుతున్నారు. 100 శాతం ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మంగళవారం మండలంలోని వెల్టూరు, ఉప్పునుంతల గ్రామాలలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమానికి సహకరించడానికి తమ ముందు ఉంటామని గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్య, వార్డు సభ్యులు, గ్రామ యువకులు ఉప్పరి బాల్ రాజు, విశ్రాంతి రెవెన్యూ ఉద్యోగి సుంకరి లింగమయ్య గౌడ్,పోనగంటి బాల్ రెడ్డి, చెన్న కిష్టా చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అద్భుతాలు సృష్టించారు..

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్, మే 12 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో హన్వాడ మండలం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా వారిని ఎమ్మెల్యే గా తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సి.చరణ్‌కుమార్ (473),డి.విజయలక్ష్మి (468),డి.రాకేష్ (452), ఎన్.అక్షయ (443), పి.కార్తిక్ (431) అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. రాబోయే పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విద్యలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సరైన దృష్టి పెట్టి ఉంటే రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందేదని అన్నారు. పేద విద్యార్థులు చదువుకోవాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని, కార్పొరేట్ స్థాయి తలదన్నే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. ఉపాధ్యాయులు వెనకబడిన, పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు సాయినాథ్, శ్రీనాథ్, వెంకటేష్, షాబుద్దీన్, కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

## భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

### - రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి

**వెల్దండ, మే 12 ప్రభాతవార్త:** బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోళి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మైనర్ బాలికను లైంగిక దాడికి పాల్పడిన బండి భగీరథ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా బాధిత కుటుంబ సభ్యులను వేధించడం దుర్మార్గమైన చర్య అని, తక్షణమే పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళల ఫిర్యాదులపై వేగంగా స్పందించే ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ బండి సంజయ్‌ని కేంద్ర సహాయ మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, నాయకులు జోగయ్య, చంద్రమోహన్ రెడ్డి, నాగులునాయక్, కొండల్ యాదవ్, గణేష్, ప్రవీణ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నేడు పాలీసెట్ పరీక్ష జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి

**నారాయణపేట, మే 12 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో పాలీసెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పాలీసెట్ కోఆర్డినేటర్ డా. ఎం. శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నేడు నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలీసెట్-2026) జిల్లాలో మొత్తం 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. అందులో నారాయణపేట పట్టణంలో 3 కేంద్రాలు, కోస్గి పట్టణంలో 2 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 1330 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, సీసీ కెమెరాలు, వైద్య సదుపాయాలు తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలలోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబడరని స్పష్టం చేశారు. హాల్ టికెట్, ఆధార్ కార్డు, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఎరేజర్ తప్పనిసరిగా వెంట తీసుకు రావాలని తెలిపారు. సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రాల్లో అనుమతి ఉండదని హెచ్చరించారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

## విద్యార్థులకు ఘనంగా సన్మానం



ఐశ్వర్య ను సన్మానిస్తున్న ఎంపీ మల్లు రవి

**ఉప్పునుంతల, మే 12 ప్రభాతవార్త :** 2025, 26 విద్యా సంవత్సరానికి గాను పది పరీక్షలో ఉత్తీర్ణత సాధించి టాపర్‌గా నిలిచిన విద్యార్థిని ఐశ్వర్యను బిసిటిఎ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో రవీంద్ర భారతిలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఐశ్వర్యను ఘనంగా సన్మానించారు. జిల్లా విద్యాధికారి అందజేసిన నివేదిక ఆధారంగా మండలంలోని కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థినీ ఐశ్వర్యను రాష్ట్ర స్థాయిలో జరిగిన సన్మాన కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి చేతుల మీదుగా సన్మానం, మెమెంటో అందుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఐశ్వర్య ప్రభుత్వపాఠశాలలో విద్యనభ్యసించి 10 పరీక్షలో టాపర్‌గా నిలిచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవడంపట్ల మండల విద్యాధికారి చంద్రశేఖర్,పాఠశాల హెచ్ఎం మేడిపూర్ మల్లికార్జున్, గ్రామసర్పంచ్ చీమర్ల లలిత వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు కట్ట మల్లారెడ్డి,భాగ్యరేఖ,మహేశ్వరి,కట్ట ప్రభాకర్‌రెడ్డి,బాలకృష్ణ,సలీం,గ్రామస్తులు అందరూ ప్రత్యేకంగా అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఐశ్వర్యను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని ఉన్నతమైన చదువులకు సహకరించాలని పలువురు కోరారు. ఎవరైనా ముందుకొచ్చి ప్రోత్సహించాలని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు కోరారు.

## మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

**వనపర్తి రూరల్, మే 12,ప్రభాతవార్త:** మహిళల ఆర్థిక సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వారిని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మహిళ సాధికార కేంద్రం సిబ్బంది సుమ తెలిపారు. మంగళవారం వనపర్తి మండలంలోని కిష్టగిరి గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వారిని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళలు దేశ నిర్మాణంలో సమాన భాగస్వాములుగా ఎదగాలంటే సామాజిక, ఆర్థిక బలోపేతం అవసరమని పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఆర్థిక మోసాల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పూర్తి ఆర్థిక అక్షరాస్యత సాధించాలని కోరారు. అలాగే సైబర్ క్రైమ్, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలల సహాయానికి 1098, సైబర్ క్రైమ్ ఫిర్యాదులకు 1930, మహిళల గృహహింస సహాయానికి 181, పోలీస్ సహాయానికి 100, వయోవృద్ధుల సహాయానికి 14567 టోల్ ఫ్రీ నంబర్ల ఉపయోగాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికార కేంద్రం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## దేవరకద్ర, కౌకుంట్ల, మండలాలలో పక్కాగా జన గణన..

### దేవరకద్ర తాహసిల్దార్ మహమ్మద్ హర్షద్

### కౌకుంట్ల తహసిల్దార్ సుందర్ రాజ్



కౌకుంట్ల మండలంలో జనగణన నమోదు చేస్తున్న దృశ్యం

**దేవరకద్ర, మే 12 ప్రభాతవార్త:** దేవరకద్ర, కౌకుంట్ల,మండలాలలో పక్కాగా జన గణన ప్రారంభించారు. కౌకుంట్ల మండల కేంద్రంలో, దేవరకద్ర మండలం గోపన్ పల్లి గ్రామంలో జన గణనను పక్కాగా పూర్తి చేయిస్తామని తహసిల్దార్ హర్షద్, కౌకుంట్ల తాహసిల్దార్ సుందర్ రాజ్ అన్నారు. మంగళవారం జనగణన 2027 ఉత్సాహంగా ప్రారంభమైంది. స్థానికంగా ఉన్న ఇండ్లకు మ్యాపింగ్ నెంబర్ రింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్లు మాట్లాడుతూ భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం చేపట్టిన జనగణను పక్కాగా పూర్తి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. జనగణనలో భాగంగా ముందుగా ఇండ్ల వివరాలు సౌకర్యాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయించడం జరుగుతుందని అన్నారు. ఎన్యూమరేటర్లు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తిచేసేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటింటి లెక్కలను సోమవారం నుంచి జూన్ 9వ తేదీ వరకు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మరోవైపు ప్రజలు యాప్ ద్వారా చేపట్టిన స్వీయ గణనను కూడా పరిశీలించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శరత్, కౌకుంట్ల ఆర్ఐ ఖదీర్, డిప్యూటీ తహసిల్దార్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

మొక్కజొన్న,వరి ధాన్యం కొనుగోళ్లకు

ఏర్పాట్లు చేసాం ; విసిలో కలెక్టర్ కుష్బూ గుప్తా

కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన

పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలి

స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించి

ఎక్కడా కొరత రాకుండా చూడాలి

కలెక్టర్లను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



విసిలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** వరి ధాన్యం,మొక్క జొన్న కొనుగోలు రైతులకు ఇబ్బంది లేకుండా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ తెలిపారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షి ంచారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వి.సి.కాన్ఫరెన్స్ హాల్ నుండి మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియతో కలిసి పాల్గొన్నారు. వీసీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎం లను పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు.

పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు 3 వేల 873 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డిఎం రవి నాయక్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేష్, జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి, జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్,జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రఘు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్థాయికి మించిన విమర్శలు మానుకోవాలి

జడ్చర్ల నియోజకవర్గం అభివృద్ధిపై

మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదు

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తంగెళ్ల అల్వాల్ రెడ్డి



మాట్లాడుతున్న తంగెళ్ల అల్వాల్ రెడ్డి

**మిడ్జిల్, మే 12 ప్రభాతవార్త :** బురదలో రాయి వేస్తే అది మన మీదనే పడుతుందని జడ్చర్ల ఎమ్మెల్యేను విమర్శించే ముందు మీ గతాన్ని మీ స్థాయిని ఒకసారి గుర్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తంగెళ్ల అల్వాల్ రెడ్డి, జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గౌస్, మాజీ సర్పంచ్ వల్లపు రావు పల్లి సాయిలు ధ్వజమెత్తారు. మంగళవారం నాడు తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో పదేళ్ల వైఫల్యాలను ఏకరువు పెట్టారని పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి మండలంలో భూకబ్జాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. పేదలకు కనీసం ఇండ్లు ఇవ్వలేని ప్రభుత్వమని పెళ్లయిన నూతన దంపతులకు రేషన్ కార్డు ఇవ్వలేని పరిస్థితులని మండిపడ్డారు. మిడ్జిల్ గ్రామంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో రూ.40 లక్షల అక్రమాలకు పాల్పడ్డారని వాటి ఆరోపణలపై పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. త్వరలోనే బీఆర్ఎస్ నాయకుల భూ భాగోతాన్ని ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. జడ్చర్లకు భారీ స్థాయిలో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తున్న ఘనత ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి దక్కిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జడ్చర్ల అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రిని కలిసిన దాఖలాలు లేవని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జడ్చర్లఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి ముఖ్యమంత్రితోనూ మంత్రులతోను సమన్వయం చేసుకుంటూ భారీ స్థాయిలో నిధులను తీసుకొచ్చిన ఘనత అభివృద్ధి చేసిన ఘనత దక్కించుకున్నారని వారు తెలిపారు. విద్య, విద్యుత్తు రహదారులు సంక్షేమాలతో మౌలిక వసతులు అన్ని రంగాలలో జడ్చర్లను అభివృద్ధి చేస్తున్న ఘనత ఎమ్మెల్యేకు దక్కిందని తెలిపారు. టిఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని తప్పుడు ఆరోపణలు మానుకొని పూర్తి ఆధారాలతో ముందుకు చర్చకు రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిపై చర్చకు రావడానికి మేము సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎడ్ల శంకర్, సువర్ణ, శ్రీశైలం, మల్లికార్జున్‌రెడ్డి, హనుమంతు నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు బంగారు సత్యము, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి, మండల నాయకులు శ్రీను నాయక్, శంకర్ నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను భర్తరఫ్ చేయాలి

**కొల్లాపూర్,మే 12, ప్రభాతవార్త :** మైనర్ బాలిక అత్యాచార కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ను తక్షణమే అరెస్టు చేసి కేంద్రమంత్రి బిజెపి నాయకుడు బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు. పెద్దకొత్తపల్లి మండలంలోని తీర్నాంపల్లి గ్రామంలో సిపిఐ జెండాను ఆవిష్కరించిన ఆయన అక్కడ జరిగిన సభను ఉద్దేశించి ప్రసంగించారు బేటి బచావో బేటి పడావో ఆకర్షణీయమైన నినాదాలు ఇచ్చే బిజెపి దేశవ్యాప్తంగా మహిళల హక్కులను మహిళలను అణిచివేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రాల్లో చూసినా బిజెపి ప్రజా ప్రతినిధులు ఎంపీలు, ఎమ్మెల్యేలు మహిళలను అత్యాచారం చేయడం హత్య చేయడం వారి కుటుంబాలను నాశనం చేయడం లాంటి సంఘటనలు అనేకం చూస్తున్నామని ఆయన అన్నారు. ఇప్పుడు తెలంగాణలో నుంచి గెలిచిన బిజెపి ఎంపీ కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్ కుమారుడు గతంలో అనేక వివాదాల్లో అతని పేరు వినిపించింది. ఇప్పుడు ఏకంగా మైనర్ బాలికపై మూడు దఫాలు అత్యాచారం చేసి ఆమెని మానసికంగా శారీరకంగా తీవ్రంగా హింసించాడని అతనిపై పోక్సో కేసు నమోదు కావడం జరిగింది. అతని అరెస్టు చేయకుండా ఉంచడం అత్యంత దారుణం అన్నారు తక్షణమే మంత్రిని బర్తరఫు చేయాలని బిజెపి నిజంగా చిత్తశుద్ధి ఉంటే పార్టీ పరమైన చర్యలు కూడా బండి సంజయ్ ఆయన కుమారులపై తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో మక్కుతున్న మొక్కలను తక్షణమే కొని తరలించి రైతుల అకౌంట్లో డబ్బులు వేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు ఎర్రజెండా ఆవశ్యకత గురించి మాట్లాడుతూ పేద ప్రజలకు రక్తంతో ఏర్పడిన జెండా ఎర్రజెండా అని ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో రాజకీయాలకతీతంగా అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ సర్పంచ్ పెబ్బేటి విజయుడు, మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు, తిరునాంపల్లి శాఖ కార్యదర్శి జి.వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ జీ రామకృష్ణ, ఎం.డి యూసుఫ్, చాపల శేఖర్,సంఘం కృష్ణ ,గోపాల్,శివ, జి రవి,నిరంజన్ బాలయ్య, చందు,మధు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోండి: ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు

**చిన్నచింతకుంట, మే 12 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ఇప్పటివరకు పనులు ప్రారంభించని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో ఇండ్లు రద్దవుతాయని ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు తెలిపారు. బుధవారం తన చాంబర్ లో మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదని ఆయన తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందుకొని ఇప్పటివరకు 114 మంది లబ్ధిదారులు ప్రారంభించలేదని ఆయన తెలిపారు. బేస్మెంట్ నిర్మాణానికి ముగ్గు వేసుకొని పనులు ప్రారంభించని 82 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు రద్దవుతాయని ఎంపీడీవో తెలిపారు. ఆయా గ్రామాలలో ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా ఆయా గ్రామాల సర్పంచులు చొరవ చూపాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సూచించినట్లుగా ఎంపీడీవో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించని లబ్ధిదారుల వద్దకు అధికారులు, సర్పంచులు వెళ్లి పనులు ప్రారంభించేలా చూడాలని ఎమ్మెల్యే సూచించినట్లు ఎంపీడీవో తెలిపారు. జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానున్నాయని తెలిపారు.

## బండి భగీరథ్‌పై నమోదైన కేసులో నిష్పక్షపాత విచారణ జరపాలి

### బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కొరం శివరాజ్ రెడ్డి

**నారాయణపేట, మే 12 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కొరం శివరాజ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌పై కేసు నమోదై మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీస్ వ్యవస్థను ప్రభావితం చేస్తూ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మైనర్ బాలికకు సంబంధించిన కేసులో హనీ ట్రాప్ అనే వాదన వర్తించదని, అలాంటి ఆరోపణలు చేయడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని పేర్కొన్నారు. బండి భగీరథ్ తానే బాలికతో కలిసి తిరిగినట్లు, పార్టీలకు వెళ్లినట్లు ఒప్పుకున్నాడని ఆయన అన్నారు. పోక్సో కేసులో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో విచారణను మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మైనర్ బాలిక కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్వీ బాధితుల పక్షాన నిలబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ కుమార్, షేక్ సామి, భరత్ కుమార్ రెడ్డి, తౌఫిక్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.రాజయ్య

**మక్తల్ టౌన్, మే 12 ప్రభాతవార్త :** మక్తల్ పురపాలక సంఘానికి నూతన మున్సిపల్ కమిషనర్ గా ఎస్ రాజయ్య బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ రాజయ్యకు కార్యాలయ సిబ్బంది ఆహ్వానం పలికారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్య పారిశుద్ధ్యం ,వీధి దీపాల నిర్వహణ మక్తల్ పట్టణ అభివృద్ధిలో పట్టణాభివృద్ధిలో తనదైన శైలిలో మెరుగైన సేవల అందజేతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని తెలియజేశారు. కార్యాలయ సిబ్బందితో సమన్వయంతో పారదర్శక పాలన అందిస్తానని తెలిపారు.పట్టణాన్ని పరిశుభ్రత అభివృద్ధి చెందే మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని ప్రతి పౌరుడు అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నాగ శివ, మున్సిపాలిటీ మేనేజర్ ఖాదర్ ఖాన్, అనిల్ కుమార్ గౌడ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**అచ్చంపేట, మే, 12 ప్రభాతవార్త:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రిన్సిపాల్ రవి పరంగి అన్నారు. మంగళవారం బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వరి డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో విద్య వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు యోగ మెడిటేషన్, పీజీ కోచింగ్ వివిధకార్యక్రమాలను ప్రోగ్రాం ఇన్చార్జులుగా ఉన్న డా. దూప్ సింగ్, ఆనంద్ ,వెంకటస్వామి ఘనంగా నిర్వహించడం జరిగింది. తదనంతరం విద్యార్థులకు పీజీ కోచింగ్ కు సంబంధించిన గైడెన్స్‌ను అధ్యాపకులు విద్యార్థులకు అందించడం జరిగింది. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.అశోక్ కుమార్, ప్రోగ్రాం ఇంఛార్జిలు డా.వెంకటయ్య, డా.లక్ష్మగౌడ్, అధ్యాపకులు డా. ఈశ్వర్ లాల్, డా. శివకుమార్, వెంకటస్వామి,శంకర్, అధ్యాపకేతర సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, రికార్డ్ అసిస్టెంట్ నరసింహులు, శివమ్మ , లలిత , చాంద్ బి ,రేణుక, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయానికి రూ.2.50లక్షల విరాళం అందజేత

**వెల్దండ, మే 12 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ ఆంజనేయస్వామి ఆలయనిర్మాణానికి గ్రామానికి చెందిన బాలకిషన్‌రావు, రమణారావు, ప్రవీణ్ కుమార్‌లు రూ.2 లక్షల 50వేల రూపాయలను ఆలయకమిటీ నిర్వాహకులకు విరాళంగాఅందజేశారు. ఆలయాన్ని నాణ్యతగా త్వరితగతిన పూర్తిచేయాలని కమిటీ సభ్యులను కోరారు. కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శశి, సందీప్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులను సన్మానించిన గోళి

**వెల్దండ,మే 12 ప్రభాతవార్త:** ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో 74 శాతం ఉత్తీర్ణత సాధించిన మండల కేంద్రానికి చెందిన దాసరి అఖిల, కొమ్ము హన్సికలను బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్ రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి ఒక్కొక్కరికి రూ.8 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్, సర్పంచ్ కొండలు యాదవ్, జోగయ్య, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, లింగ ముదిరాజ్, నిరంజన్, దేవేందర్, ఆనంద్, శేఖర్, నరసింహ ముదిరాజ్, గణేష్, ప్రవీణ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి ; సిఐ

**వెల్దండ,మే12 ప్రభాతవార్త:** ప్రశాంతమైన వాతావరణంలో పండగలు నిర్వహించుకోవాలని సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మైనారిటీలతో ఎస్ఐ యుగేందర్ రెడ్డి తో కలిసి సిఐ రఘువీర్ రెడ్డి సమావేశమై మాట్లాడుతూ బక్రీద్ పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మతసామరస్యాలకు ప్రతికగా పండుగలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరికిషన్ నాయక్, సర్పంచ్ కొండల్ యాదవ్, కేశమల్ల కృష్ణతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు మత పెద్దలు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం

**అచ్చంపేట,మే,12 ప్రభాతవార్త:** మండలంలోని చౌటపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ పనితీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు,గ్రామానికి చెందిన కేశమోని పార్వతమ్మ అత్త నాగమ్మ మరణించడంతో అత్త పేరుమీద ఉన్న ఇల్లును కోడలు అయిన పార్వతమ్మ పేరుపై మార్పిడి చేస్తానని కార్యదర్శి రూ.4వేలు తీసుకొని రేపు మాపు అని కాలయాపన చేస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.నెల రోజులనుండి ఎప్పుడూ అడిగినా సర్వర్ బిజి అని చెపుతున్నాడని ఆమె తెలిపారు.ఇప్పటికైనా మా అత్త ఇల్లు నా పేరుమీద మార్చాలని కోరారు.

## ఘనంగా హనుమాన్ జయంతి



**ఉప్పునుంతల, మే 12 ప్రభాతవార్త :** హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మండలంలోని అయ్యవారిపల్లి లో గ్రామ సర్పంచు జిల్లెల జగత్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఆలయ ప్రాంగణంలో సామూహిక హోమాలు, ఆంజనేయ స్వామికి అభిషేకం, జలాభిషేకం, ఆలయ పునర్నిర్మాణ సంపూర్ణ మహా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి,చెన్ రెడ్డి యాదిరెడ్డి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ధ్యానం, ఏఐ బోధనపై అవగాహన

**మహబూబ్‌నగర్, మే 12, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఎడ్యుకేషన్ వీక్‌లో భాగంగా మంగళవారం పాలమూరు విశ్వవిద్యాలయం సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ధ్యానం, మానసిక ఆరోగ్యం, బోధనలో కృత్రిమ మేధస్సు వినియోగం, కమ్యూనికేషన్ స్కిల్స్ అంశాలపై నిపుణులు అధ్యాపకులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కన్హా శాంతి వనం ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యాన కార్యక్రమంలో ట్రైనర్ మాధవి మాట్లాడుతూ ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభించడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి. రమేష్ బాబు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానానికి ధ్యానం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాధాన్యతపై న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డా. జె. మాళవి ప్రసంగించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డా. కే ప్రవీణ, యూనివర్సిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఐక్యు ఏసి డైరెక్టర్ డా.డి మధుసూదన్ రెడ్డి, ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్ డా. నాగం కుమార్ స్వామి, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రవికాంత్, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా.ఏ. కరుణాకర్ రెడ్డి, డా. నూర్జహాన్, డా. శాంతి ప్రియ, కామర్స్ బిఓఎస్ చైర్మన్ డా. కే రాజ్ కుమార్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. ఎస్ ఎన్ అర్జున్ కుమార్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.వి భూమయ్య, పిఆర్ఓ డా.ఎం. గాలెన్న, కార్యక్రమ కోఆర్డినేటర్ డా.ఎస్ రవికుమార్, కనహ శాంతివనం ట్రైనర్ రవి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం మిల్లులకు తరలించాలి

### లారీ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సహకరించాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 12 ప్రభాతవార్త :**ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌లు అవసరమైన లారీలు ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ ఆదేశించారు.మంగళవారం.జిల్లాకలెక్టర్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో ధాన్యం రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. సమావేశంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలింపు పురోగతిని సమీక్షించారు. భారీగా ధాన్యం వచ్చిన పీపీసీల వద్ద అదనపు లారీలను ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల స్థానిక ట్రాక్టర్ల ను వినియోగించాలని, అలాగే ట్రాన్స్‌పోర్ట్ శాఖ ద్వారా ఏర్పాటు చేస్తున్న వాహనాలను సమర్థ వంతంగా ఉపయోగించాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. అకస్మాత్తుగా కురిసే వర్షాలు , ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ధాన్యం నష్టపోకుండా ఉండేందుకు, పీపీసీ లలో ఉన్న ధాన్యం నిల్వలను వెంటనే మిల్లులకు తరలించాలని అన్ని కాంట్రాక్టర్లను యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశం లో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.ఎం.రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతుడు మహా శక్తివంతుడు

### డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి

**వనపర్తి,మే 12, ప్రభాతవార్త :** హనుమంతుడు మహా శక్తివంతుడు అని బలం, ధైర్యానికి, భక్తికి ప్రతీక అయిన ఆంజనేయ స్వామి ఆశీస్సులు , జిల్లా, రాష్ట్ర ప్రజలపై, ఆంజనేయ స్వామి భక్తులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.మంగళవారం జిల్లాకేంద్రంలో చింతల హనుమాన్ దేవాలయంలో శ్రీ ఆంజనేయస్వామి జన్మదిన పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి ఆంజనేయ స్వామి భక్తుల ఆహ్వానం మేరకు ఇరుముడి కార్యక్రమానికి హాజరై పాల్గొన్నారు.హనుమాన్‌జయంతి సందర్భంగా దేవాలయంలో అభిషేకాలు , వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలకు,స్వాములకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం భక్తులసందడితో ఆధ్యాత్మిక వాతావరణంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి ,మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, నందిమల్ల చంద్రమౌళి, మాజీ మండల అధ్యక్షులు రవి కిరణ్, పాండు సాగర్, శివకుమార్ నాయుడు, ఆంజనేయ స్వామి భక్తులు, స్వాములు పలువురు పాల్గొన్నారు.

## కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### దేవరకద్ర తహసిల్దార్ మహమ్మద్ హర్షద్

**దేవరకద్ర, మే 12 ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని దేవరకద్ర తహసిల్దార్ హర్షద్ అధికారులకు సూచించారు. దేవరకద్ర మండలం గోపన్ పల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తూకం, తేమ శాతం, హమాలీల సేవలు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించిన ఎమ్మెల్యే

**పెబ్బేరు, మే 12 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికలకు వేసవి శిక్షణ తరగతులను ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి మంగళవారం ప్రారంభించారు.ఈ శిక్షణ శిబిరంలో క్రీడలు,నృత్యాలు,ఆంగ్లము,గణితము,చిత్రలేఖనం,కరాటే లాంటి వాటిపై శిక్షణ ఇస్తారని విద్యార్థులు శ్రద్ధాసక్తులతో నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. వేసవి సెలవులు ఉన్నందున వనపర్తి జిల్లా పరిధిలోని 15 కస్తూర్బా గాంధీ పాఠశాలల నుంచిరోజుకు ఒక పాఠశాలకు చెందిన అధ్యాపకులు ఇక్కడ విధులు నిర్వహిస్తుంటారని విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు లోను కాకుండా శిక్షణ పొందవచ్చునని వారికి తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ప్రభుత్వ పరమైన ప్రతి శాఖలో ఉద్యోగస్తులుగా స్థిరపడాలని ఒక గోల్‌తో విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బండి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలి

### డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్

**దామరగిద్ద, మే 12 ప్రభాతవార్త:** బాలికపై లైంగికంగా దాడికి పాల్పడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ డిమాండ్ చేశారు. మంగళవారం దామరగిద్ద మండల కేంద్రంలోని నారాయణపేట మద్దూరు రహదారిపై ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ,సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించి, బాధితురాలికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధ్యత కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించి అండగా ఉండాలని ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్ ని తక్షణమే మంత్రి పదవి నుండి తప్పించాలని డిమాండ్ చేశారు.24గంటల్లో నిందితుడని అరెస్టు చేయకపోతే డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, మహిళా సంఘాలతో,ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అంజిలయ్య గౌడ్, నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాల్, ప్రకాష్,నర్సింహులు, రవీందర్,గోవిందు, రాజు, ఎల్లప్ప,గోపాల్ పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించాలని ఎంపీడీవోకు వినతి

**లింగాల, మే 12, ప్రభాతవార్త :** మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని లింగాల మేజర్ గ్రామపంచాయతీలో పని చేస్తున్న సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం లింగాల గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లించాలని కోరుతూ పంచాయతీ సెక్రటరీ తో పాటు ఎంపీడీఓ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిపి సిబ్బంది మాట్లాడుతూ ఈ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ కు సంబంధించిన మూడు నెలల జీతాలు చెల్లించక పోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని వాపోయారు. ఇచ్చేదే చాలీచాలని జీతాలని అది కూడా సమయానికి రాక పోవడంతో పూట గడవడం కష్టంగా మారిందని మా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని లేనట్లయితే చేసేది లేక ఈ నెల 16 నుండి గ్రామపంచాయతీ ద్వారా తాము చేసే పనులను చేయడం బంద్ చేస్తామని తెలిపారు. ఎంపీడీవో చంద్రశేఖర్ స్పందిస్తూ లింగాల జిపి సిబ్బంది వేతనాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వచ్చి తొందరగానే జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మైనర్ బాలిక కేసులో నిందితుడిని

## వెంటనే అరెస్ట్ చేయాలి: బీఎస్పీ డిమాండ్

### చట్టం ముందు అందరూ సమానమేనని బీఎస్పీ నేత వ్యాఖ్యలు

**ధన్వాడ, మే 12 ప్రభాతవార్త :** మైనర్ బాలికపై జరిగినట్లు ఆరోపణలు ఉన్న అత్యాచారం కేసులో నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నారాయణపేట జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై పోలీసులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. చట్టం ముందు అందరూ సమానమే కావాలని, ఎవరైనా నిందితులైతే వారి రాజకీయ, సామాజిక స్థాయి ఏమిటన్నది పక్కనపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఆడబిడ్డల భద్రత విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మైనర్ బాలికకు న్యాయం జరగాలంటే, సంబంధిత నిందితుడిపై పోక్సో చట్టం ప్రకారం వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ధాన్యం బస్తాల లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి

**మద్దూరు, మే 12 ప్రభాతవార్త :** కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన ధాన్యం బస్తాలను వెంటనే లోడింగ్ చేయాలని, రైస్ మిల్లులకు చేరిన లారీలను ఆలస్యం లేకుండా అన్‌లోడింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణలో భాగంగా కేంద్రాలు, మిల్లుల వద్ద లోడింగ్–అన్‌లోడింగ్ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందని పేర్కొంటూ, రెండు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న ధాన్యం బస్తాల తరలింపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ డా. వినీత్ కుమార్ తో కలిసి మద్దూరు, పల్లెగడ్డ తండా, దొరేపల్లి, గుండుమాల్, అమ్లికుంట ప్రాంతాల్లోని పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మద్దూరు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాల సంఖ్య, నిల్వలు, ఇంకా రైతుల వద్ద ఉన్న ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ప్రస్తుతం 5 వేల బస్తాలు నిల్వ ఉండగా, లారీల కొరతతో లోడింగ్ నిలిచిపోయిందని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే ఆర్టీవో మేనకా గాంధీతో ఫోన్‌లో మాట్లాడి మద్దూరు, గుండుమాల్, కోస్గి మండలాల్లో అదనపు లారీలను సమకూర్చాలని ఆదేశించారు. పల్లెగడ్డ తండా ఐకేపీ కేంద్రంలో



కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక,కలెక్టర్ వెంట ఎస్పీ డా.వినీత్

ధాన్యం తేమ శాతం, ప్యాడీ క్లీనర్ పనితీరును పరిశీలించిన ఆమె నిల్వలో ఉన్న బస్తాల తరలింపునకు నాలుగు లారీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దొరేపల్లి కేంద్రంలో బస్తాల తూకాన్ని తనిఖీ చేసి, అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. రైతులకు తాగునీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. గుండుమాల్ కొనుగోలు కేంద్రంలో రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపుల వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం కోస్గి మండలం కడెంపల్లి మహాలక్ష్మి రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీలను వెంటనే అన్‌లోడ్ చేసి తిరిగి కేంద్రాలకు పంపించాలని మిల్లు యజమానులకు ఆదేశించారు. అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేసి అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ఇంకా రానున్న పది రోజులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, ఆర్టీవో శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేంద్రాల్లో లోడింగ్, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పనుల ఫోటోలను ఎప్పటికప్పుడు తమకు పంపించాలని అధికారులను ఆదేశించారు.చివరగా అమ్లికుంట కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్‌కు, రహదారి ఇరుకుగా ఉండటంతో పెద్ద లారీలు రావడం కష్టమని రైతులు వివరించారు. దీంతో ట్రాక్టర్ల ద్వారా ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్, వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సైదులు, డీసీఓ హరిప్రసాద్, తహసిల్దార్లు మహేష్, భాస్కర్, బక్క శ్రీనివాస్, సీఐ సైదులు, ఏవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## అమ్మబోతే.. అడవి!

(మొదటి పేజీ తరువాయి)



మార్కెట్‌కు ధాన్యాన్ని తెచ్చిన రైతులు

గోదాముల్లో దిగుమతి చేసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. కూడా అలాగే చేశామని తెలపడంతో సమస్య సర్దుమనిగింది. జడ్చర్ల మార్కెట్ కార్యదర్శి నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు తలెత్తాయని అధికారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. దీంతో ప్రస్తుతం భూత్పూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శికి జడ్చర్ల అదనపు మార్కెట్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు కూడా అప్పజెప్పారు. అయితే ఇటు అధికారులకు అటు ప్రభుత్వానికి పంట ఏ మేరకు దిగుబడి వచ్చింది ఎన్ని గన్ని సంచులు అవసరం ఉంటాయి ఎక్కడ స్టాక్ నిల్వ చేసుకోవాలి అనే కనీసం అవగాహన లేకపోవడంతోనే ఇలా ఇబ్బందులు జరిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే తూకం చేసిన ధాన్యాన్ని సంచుల్లో నింపి గోదాముల్లో నిల్వ ఉంచే ప్రక్రియనే ఇంకా కొనసాగుతున్నది. ఇప్పటికే తూకం చేసిన మక్కలను గోదాముల్లో నింపే వరకు కొత్తగా మార్కెట్కు తీసుకువచ్చిన మక్కలను కొనుగోలు చేయడం కుదరదు అని అధికారులు తేల్చి చెబుతున్నారు. జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డ్ లో ఇంకా 35 వేలకు పైగా బ్యాగుల ధాన్యం ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు రైతుల ద్వారా తెలుస్తున్నది.

**ధాన్యం నింపడానికి..దించడానికి డబ్బులే..**

రైతులు మార్కెట్కు ధాన్యాన్ని తీసుకువచ్చి ఆరబెట్టిన అనంతరం అసలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆరబెట్టిన ధాన్యం 14 శాతం మాయిస్చర్ వచ్చేంతవరకు వేచి ఉండడమే కాకుండా, ఒక సంచి ధాన్యం తూకం చేసి నింపడానికి రూ.26 తీసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ధాన్యం తూకం చేసిన జాగా నుంచి గోదాంకు తీసుకు వెళ్లేందుకు ట్రాక్టర్ కు రూ.500 నుంచి 1500 వరకు, ఒక్కో సంచికి తిరిగి రూ. మూడు నుంచి 6 తిరిగి చెల్లించాల్సి వస్తుంది. అంతేకాకుండా గోదాం వద్ద మళ్లీ దించడానికి కూడా ఒక్కో సంచికి రూపాయలు మూడు తీసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

## ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో ఎక్కడైనా లీకేజీలు, దెబ్బతిన్న ప్రాంతాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజినీర్లకు సూచించారు. నీటి సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా లేదా బోర్‌వెల్‌ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.చిన్నచిన్న సమస్యల కారణంగా పనులు పెండింగ్‌లో ఉంచకుండా సమస్య పరిష్కార దృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వాసితుల ఖాతాల్లో వారికి అందాల్సిన పరిహారం నిధులు జమ చేసినప్పటికీ ఇప్పటివరకు ఒక్క కుటుంబం కూడా పునరావాస కాలనీలోకి వెళ్లకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి నిర్వాసితులను కాలనీలోకి తరలించాల్సిన అవసరం ఉందన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితుల తరహాలో ప్లాట్లను లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేస్తే వారు ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తారని సూచించారు. రోడ్లు, ఆలయాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలు, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు, విద్యుత్ సదుపాయాలు వంటి పెండింగ్ మౌలిక వసతుల పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు.ప్లాట్ల కేటాయింపులు, పరిహార చెల్లింపుల విషయంలో వివాదాల కారణంగా పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. పునరావాస కాలనీ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను నాగసాలకు తరలిస్తే నిర్వాసితులు కాలనీలోకి రావడానికి ఆసక్తి చూపుతారని సూచించారు.జడ్చర్ల మండలం,మున్సిపాలిటీ లో తాగునీటి సమస్యపై మాట్లాడుతూ, వేసవిలో ప్రస్తుత సరఫరా సరిపోవడం లేదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలు, వాటిపై రియల్ ఎస్టేట్ లేఅవుట్లు వేస్తున్నారనే ఫిర్యాదులపై విచారణ జరపాలని కోరారు. బాలానగర్ మండలంలో వాగు ఆక్రమణ చేసి మళ్లించిన ఘటనపై కూడా విచారణ జరపాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, డిఆర్ఓ రామ్‌రెడ్డి, ఆర్‌డిఓ నవీన్, భూ రికార్డుల సర్వే ఎడి అశోక్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్,విద్యుత్ శాఖల ఈఈలు, డీఈలు, ఉదండపూర్, వల్లూరు సర్పంచులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

కలిగి ఉండాలని, మూడు రోజుల్లో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లు, సందులు, ఇంటి నంబర్లు, లైన్ నంబర్లను స్పష్టంగా గుర్తిస్తూ పెన్సిల్‌తో మ్యాప్ రూపొందించుకోవాలని సూచించారు. ఇంటి నంబర్లు, లైన్ నంబర్లను మార్కర్ ఆధారంగా నమోదు చేస్తే భవిష్యత్తులో పరిశీలన, రీవెరిఫికేషన్ సులభమవుతుందని తెలిపారు. తమ బ్లాక్ పరిధిలో రోజుకు కనీసం 20 ఇళ్లను కవర్ చేస్తే నిర్ణీత గడువులోగా ఇండ్ల గణన ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. గణన సిబ్బంది ఇంటింటికి వెళ్లే సమయంలో తప్పనిసరిగా అధికారిక ఐడి కార్డు వేసుకోవాలని, ప్రజల్లో అనుమానాలు లేకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ వాహనాలు, వాట్సాప్ గ్రూపులు, మహిళా సంఘాలు, ఆర్పీలు, స్థానిక చానల్స్ ద్వారా గణనపై ప్రజలకు అవగాహన కలిగేలా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న గణనను కూడా సంబంధిత చార్జ్ అధికారులు క్షేత్రస్థాయిలో తరచు పరిశీలించాలన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసిన కుటుంబాల వివరాలను కూడా సరి చూసుకొని సంబంధిత యాప్ లో ఖచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. జనగణన విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.సి.పి.ఓ హరికృష్ణ, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్‌లు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## బండి సంజయ్ కుమారున్ని వెంటనే అరెస్టు చేయాలి

**కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైంది**

**కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వెన్ను విరుస్తుంది**

**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను పెంచాలి**

**మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**

**మక్తల్ టౌన్, మే 12 ప్రభాతవార్త :** రాష్ట్ర హోం శాఖ కేంద్ర సహాయ మంత్రి తనయుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో అన్నారు. గతంలో కేసీఆర్ పాలనను మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా ఉక్కు పాదం మోపి నిందితులను వెంటనే అరెస్టు చేసి అవసరమైతే వారిపై షూట్ ఆర్డర్ చేసిన ఘనత గత పాలనలో ఉండేదని ప్రస్తుతం మహిళలకు రక్షణ కరువైందని మాజీ ఎమ్మెల్యే మండిపడ్డారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం లో జరుగుతున్న పనులలో నాణ్యత పూర్తిస్థాయిలో లోపించిందని నాణ్యత లేని పనులు కొనసాగిస్తే సహించేది లేదని ప్రజాధనాన్ని వృధా చేస్తే మేము ఊరుకోమని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల ఇసుక విషయంలో కూడా కమిషన్లు కొందరు తీసుకుంటున్నారని వారి పేర్లను త్వరలో ప్రకటిస్తానని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కేవలం నర్వ మండలంలో మాత్రమే పెట్టారని నియోజకవర్గంలో కొనుగోలు కేంద్రాలను ఇంకా పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రూ. 2400ల మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని అన్నారు. కేవలం 8000 సంచులు ఇచ్చి రైతులకు ఇబ్బంది పెడుతున్నారని వారికి లెక్కల ప్రకారం 32000 సంచులు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అవసరమని ఆ విషయం అధికారులకు తెలిసినా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల వ్యాపారస్తుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి భద్రతల పట్ల విఫలమయితుందని విమర్శించారు. బండి భగీరథ్ మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడి 15 రోజులు గడుస్తున్న పోలీసు యంత్రాంగం బండి సంజయ్ కుమారున్ని అరెస్ట్ చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. మైనర్ కేసు నమోదైనా బండి భగీరథ్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న మహిళా కాంగ్రెస్ నేతలు, బిజెపి మహిళ నేతలు బండి భగీరథ విషయం పట్ల ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. బండి భగీరథ్‌ను అరెస్టు చేసేదాకా బిఆర్ఎస్ నాయకులు పోరాటం చేస్తూనే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహ గౌడ్, పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షులు జుట్ల చిన్న హనుమంతు, అమ్మపల్లి సర్పంచ్ నరసింహ, మన్నాన్, టిఆర్ఎస్ నాయకులు గార్లపల్లి నరసింహారెడ్డి, జి.ఈశ్వర్ యాదవ్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టినా...

## రిజిస్ట్రేషన్ మాత్రం ఇంఛార్జికే...

(మొదటి పేజీ తరువాయి)

కూడా నిర్వహించేలా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై నూతన తహసీల్దార్ మహ్మద్ హర్షద్‌ను వార్త వివరణ కోరగా,నేను కొత్తగా వచ్చాను. ఏమైనా పొరపాట్లు జరుగుతాయేమోనని రిజిస్ట్రేషన్ల బాధ్యతలు స్వీకరించలేదని అందుకే ఇంచార్జి తహసిల్దారే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని,తాను మిగతా రెవెన్యూ పనులు చూసుకుంటున్నానని తెలిపారు.

## తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిస్థాయిలో అందకపోవడం ఏంటని ప్రశ్నించారు.అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కారమార్గాలను అన్వేషించి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. వచ్చే వారంలో మరోసారి సమీక్ష నిర్వహిస్తామని ఆలోగా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఐడిఓసి సమావేశ మందిరంలో రోడ్లుభవనాలు,పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బిశాఖకు మంజూరు అయిన ప్లాన్,నాన్ ప్లాన్ పనుల పురోగతి పై సమీక్ష నిర్వహించారు.వనపర్తి కొల్లాపూర్,వెంగళాయపల్లి రోడ్డువిస్తరణ పనులు,కేతేపల్లి సిసిరోడ్డు పనులు మధ్యలో ఎందుకు ఆగిపోయాయని ఆర్అండ్‌బి కార్యనిర్వాహక ఇంజనీరును ప్రశ్నించారు. ఒక్కో పనిలో దాదాపు 50 లక్షల పనులు పూర్తి అయ్యాయని, కానీ ఇప్పటి వరకు పని చేసిన దానికి డబ్బులు మంజూరు కానందున కాంట్రాక్టర్లు పనులు ఆపేశారని మంత్రి దృష్టికీ తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి మధ్యలో ఆగిపోయిన అన్ని పనులకు తన రిఫరెన్స్ తో ప్రభుత్వానికి లేఖలు రాయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ఆర్డీఓ సుబ్రమణ్యం, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ఆర్ అండ్ బి ఈఈ దేశ్యా నాయక్, ఎస్.ఈ మిషన్ భగీరథ, ఈఈ అంజద్ పాషా, ఎస్‌డిసి తిరుపతయ్య, డిఈలు, ఎఈ లు, ఇతర అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులు మరియు గోదాములకు సమయానికి తరలించేందుకు అవసరమైన హమాలీలను సమకూర్చడంతో పాటు రవాణా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా లారీలను ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ పరీక్షలు, తూకం ప్రక్రియ, చెల్లింపుల వ్యవస్థ వంటి అంశాల్లోనూ పటిష్ట పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఆలస్యం లేకుండా వరి పంటకు తగిన మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం సేకరణప్రక్రియలో ఎక్కడాజాప్యం లేకుండా పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసేలా జిల్లా స్థాయి నుండి అవసరమైన మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా 48 గంటల్లోనే బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ అయ్యేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ వెల్లడించారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని సంబంధిత అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నామని చెప్పారు.


### నేడు ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

**చిన్నంబావి,మే 12 ప్రభాతవార్త :**మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 2025 26 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నేడు 11 గంటలకు చిన్నం బావి ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకర్‌ల సమక్షంలో నిర్వహించబడతాయని ,దరఖాస్తు చేసుకునే ప్రతి లబ్ధిదారులు వారి యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లతో చిన్నంబావి మండల ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావలసిందిగా ఎంపీఓ రామస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

### రిజిస్ట్రేషన్ కోసం పడిగాపులు

**సమయపాలన పాటించని రెవెన్యూ అధికారులు**

**దేవరకద్ర, మే 12 ప్రభాతవార్త:** దేవరకద్ర తహసిల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పనుల కోసం వచ్చిన ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు సమయానికి కార్యాలయానికి రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కార్యాలయంలో అధికారులు రాక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం

ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, భూయజమానులు, దరఖాస్తుదారులు కార్యాలయం ఎదుట పడికాపులు కాశారు. ఉదయం 11 :00 కావస్తున్న అధికారులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఎండలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసిల్దార్ వచ్చిన, రిజిస్ట్రేషన్ మేడం రాలేదని రైతులు అటెండర్‌లను అడగగా, కలెక్టర్ ఆఫీస్‌కి వెళ్ళింది. వచ్చేస్తారని సమాధానం చెప్పారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి, కార్యాలయాల్లో సమయపాలన ఖచ్చితంగా అమలు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.